# ఇండియన్ పాలిటీ

## భారత రాష్ట్రపతి – అధికారాలు

**సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని (అసమర్థత, దుష్ప్రవర్తన కారణాల పై) పార్లమెంట్ ఉభయ సభలు విడివిడిగా ప్రత్యేక మెజారిటీతో ఆమోదిస్తే, వారిని రాష్ట్రపతి తొలగించవచ్చు.**

**అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ నెల లేదా 30 రోజుల్లోపు 2/3వ వంతు మెజారిటీతో విడివిడిగా ఉభయ సభలు ఆమోదించాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఒకసారి ఆమోదిస్తే అది 6 నెలలపాటు అమల్లో ఉంటుంది. దీన్ని తిరిగి ఆమోదించడం ద్వారా పొడిగించవచ్చు.**

**నీలం సంజీవరెడ్డి అత్యంత చిన్న వయసులో రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు.**

---

### న్యాయాధికారాలు

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంతోపాటు, హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేసే అధికారమూ ఉంటుంది. బదిలీల విషయంలో రాష్ట్రపతి నిర్ణయం అంతిమం. అంతేగాక వీరు తమ రాజీనామా పత్రాలను రాష్ట్రపతి పేరు మీదుగా రాసి, ఆయనకే సమర్పించాల్సి ఉంటుంది.

★ ప్రజాప్రాధాన్యం ఉన్న అంశంపై 143 వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు. సుప్రీంకోర్టు తప్పనిసరిగా సలహా ఇవ్వాలి. అయితే రాష్ట్రపతి ఆ సలహాను పాటించవచ్చు, పాటించకపోవచ్చు.

★ ఉన్నత న్యాయస్థానాలు విధించిన శిక్షల విషయంలో కేంద్ర మంత్రిమండలి సలహాపై 72 వ నిబంధన ప్రకారం రాష్ట్రపతికి కింది అధికారాలు ఉంటాయి.

i) క్షమాభిక్ష - శిక్షను పూర్తిగా రద్దు చేయడం. దీన్నే Pardon అంటారు.

ii) శిక్ష కాలాన్ని తగ్గించడం (Remission)

(iii) శిక్షలను మార్పు చేయడం (Commutation)

(iv) శిక్ష అమలు కాకుండా వాయిదా వేయడం (Reprieve)

(v) ప్రత్యేక పరిస్థితుల్లో తాత్కాలిక ఉపశమనం. (Respite)

★ శ్రీధర్ Vs గౌరు వెంకటరెడ్డి వివాదంలో (2006) సుప్రీంకోర్టు రాష్ట్రపతి క్షమాభిక్ష అధికారం కూడా న్యాయసమీక్షకు గురవుతుందని పేర్కొంది.

★ రాష్ట్రపతి విధి నిర్వహణ విషయంలో ఏ న్యాయస్థానానికీ జవాబు చెప్పాల్సిన అవసరం లేదు.

★ అధికారంలో ఉన్న రాష్ట్రపతిని అరెస్టు చేయకూడదు. క్రిమినల్ కేసులు పెట్టకూడదు. అయితే 2 నెలల ముందస్తు నోటీసుతో సివిల్ కేసు వేయొచ్చు.

### సైనిక అధికారాలు

నిబంధన 53(2) ప్రకారం రాష్ట్రపతి సర్వ సైనాధ్యక్షుడు. త్రివిధ దళాల అధిపతులను నియమిస్తాడు.

★ యుద్ధం ప్రకటించడానికి, శాంతి కోసం ఒప్పందాలు చేసుకోవడానికి అధికారం కలిగి ఉంటాడు. అయితే పార్లమెంట్ ఆమోదం అవసరం.

### దౌత్య అధికారాలు

★ రాష్ట్రపతికి విశేషమైన దౌత్య అధికారాలు ఉన్నాయి. విదేశాల్లో భారత రాయబారులను నియమిస్తారు. ఇతర దేశాల రాయబారుల నియామకాన్ని ఆమోదిస్తారు.

★ అంతర్జాతీయంగా భారతదేశం చేసుకునే ఒప్పందాలు రాష్ట్రపతి పేరుమీదుగా జరుగుతాయి. వీటికి పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదం అవసరం.

### అత్యవసర అధికారాలు

దేశంలో అత్యవసర (లేదా) అసాధారణ పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజ్యాంగం 3 రకాల అత్యవసర అధికారాలను రాష్ట్రపతికి కల్పించింది.

★ **జాతీయ, అత్యవసర పరిస్థితి (నిబంధన 352):** యుద్ధం, విదేశీ దాడి, సాయుధ తిరుగుబాటు మొదలైన కారణాల వల్ల దేశం లేదా దేశంలోని ఏదైనా ఒక ప్రాంత భద్రతకు భంగం కలుగుతుందని రాష్ట్రపతి భావిస్తే నిబంధన 352 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించవచ్చు. అయితే దీన్ని కేంద్ర కేబినెట్ లిఖిత పూర్వక సలహా మేరకు మాత్రమే ప్రకటించాల్సి ఉంటుంది.

★ కింది సందర్భాల్లో దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు.

a) 1962 అక్టోబరు - 1968 మార్చి: చైనా దురాక్రమణ

b) 1971 డిసెంబరు - 1977 మార్చి: పాకిస్థాన్ దాడి

c) 1975 జూన్ - 1977 మార్చి: ఆంతరంగిక కల్లోలం

★ జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించడం వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, ప్రాథమిక హక్కులపై విశేష ప్రభావం పడుతుంది.

★ **రాజ్యాంగ అత్యవసర పరిస్థితి:** రాజ్యాంగంలోని 356 వ నిబంధన ప్రకారం ప్రకార ఏదైనా రాష్ట్రంలో రాజ్యాంగం ప్రకారం పరిపాలన నిర్వహించడం అసాధ్యమని సంబంధిత రాష్ట్ర గవర్నర్ చేసిన సిఫారసును అనుసరించి రాష్ట్రపతి ఆ రాష్ట్రంలో రాజ్యాంగ అత్యవసర పరిస్థితి ప్రకటించగలరు. దీన్ని 'రాష్ట్రపతి పాలన' అని కూడా అంటారు.

★ రాజ్యాంగ అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ సాధారణ మెజారిటీతో 2 నెలల్లోపు ఆమోదించాల్సి ఉంటుంది. ఒకసారి ఆమోదిస్తే 6 నెలల కాలం అమల్లో ఉంటుంది. దీన్ని కొనసాగించాలంటే పార్లమెంట్ ఆమోదం అవసరం. గరిష్ఠంగా 3 సంవత్సరాల వరకు పొడిగించవచ్చు.

★ **ఆర్థిక అత్యవసర పరిస్థితి (నిబంధన 360):** దేశం మొత్తం లేదా ఏదైనా రాష్ట్రం ఆర్థిక సంక్షోభం లేదా తీవ్రమైన అప్పుల ఊబిలోకి వెళ్తోందని రాష్ట్రపతి భావిస్తే నిబంధన 360 ప్రకారం ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించవచ్చు.

★ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ సాధారణ మెజారిటీతో 2 నెలల్లోపు ఆమోదించాల్సి ఉంటుంది. ఒకసారి పార్లమెంట్ ఆమోదిస్తే, తర్వాత రాష్ట్రపతి రద్దుచేసేంతవరకు కొనసాగుతుంది. ఇప్పటివరకు దీన్ని ఒక్కసారి కూడా విధించలేదు.

★ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటిస్తే సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల జీతభత్యాలతో సహా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల జీతాలను కూడా తగ్గించవచ్చు.

★ చివరగా రాష్ట్రపతికి రాజ్యాంగ పరిరక్షకుడిగా బాధ్యతలు ఉన్నా రాజ్యాంగపరంగా విచక్షణాధికారాలు లేవు.

**మాదిరి ప్రశ్నలు**

**1.** ఏ నిబంధన ప్రకారం రాష్ట్రపతి తన విధులను మంత్రిమండలి సహాయం, సలహామేరకు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది?

ఎ) నిబంధన 52 బి) నిబంధన 74 సి) నిబంధన 75 డి) నిబంధన 76

**2.** రాష్ట్రపతిపై మహాభియోగ తీర్మానం ఏ కారణంపై ప్రవేశపెట్టవచ్చు?

ఎ) అవినీతి బి) అసమర్థత సి) రాజ్యాంగ ఉల్లంఘన డి) అనారోగ్యం

**3.** దిల్లీలో రాష్ట్రపతి భవన్ ఉన్న ప్రాంతాన్ని ఏ పేరుతో పిలుస్తారు?

ఎ) రైసినా హిల్స్ బి) హార్సిలీ హిల్స్ సి) సిమ్లా డి) జనపథ్

**4.** మొట్టమొదటిసారిగా నిబంధన 356 ప్రకారం రాజ్యాంగ అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలనను ఏ రాష్ట్రంలో విధించారు?

ఎ) కేరళ బి) ఉత్తర్ ప్రదేశ్ సి) జమ్మూ, కశ్మీర్ డి) పంజాబ్

**5.** ఒక బిల్లును రాష్ట్రపతి పునఃపరిశీలన కోసం మంత్రిమండలికి పంపవచ్చు. అయితే మంత్రిమండలి పునఃపరిశీలన తర్వాత రాష్ట్రపతి వద్దకు వచ్చిన బిల్లుపై తప్పక సంతకం చేయాలని తెలిపే రాజ్యాంగ సవరణ చట్టమేది?

ఎ) 42 వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 బి) 44 వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978

సి) 38 వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975 డి) 25 వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971

**6.** రాజ్యాంగంలోని నిబంధన 78 ప్రకారం రాష్ట్రపతికి ఏ హక్కు ఉంది?

ఎ) జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడం బి) రాష్ట్ర గవర్నర్ నుంచి సమాచారాన్ని కోరడం

సి) భారత ప్రధానమంత్రి నుంచి సమాచారాన్ని కోరడం డి) రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సమాచారాన్ని కోరడం

**7.** హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేసే అధికారం ఎవరికి ఉంది?

ఎ) రాష్ట్ర గవర్నర్ బి) రాష్ట్రపతి

సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి) ప్రధానమంత్రి

**8.** ఒక రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులను తొలగించే అధికారం ఎవరికి ఉంది?

ఎ) రాష్ట్రపతి బి) రాష్ట్ర గవర్నర్ సి) ముఖ్యమంత్రి డి) ప్రధానమంత్రి

**9.** రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి కింది ఏ అధికారాలు లేవు?

ఎ) కార్య నిర్వహణాధికారాలు బి) విచక్షణాధికారాలు సి) శాసనాధికారాలు డి) న్యాయాధికారాలు

**10.** పాకెట్ వీటోను ఉపయోగించిన ఏకైక రాష్ట్రపతి ఎవరు?

ఎ) కె.ఆర్. నారాయణన్ బి) ఎ.పి.జె. అబ్దుల్ కలాం

సి) డా. బాబూ రాజేంద్రప్రసాద్ డి) జ్ఞానీ జైల్‌సింగ్

**11.** 'ఆంతరంగిక కల్లోలం' కారణంతో జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన కాలం....

ఎ) 1975-77 బి) 1971-77 సి) 1962 - 68 డి) 1978-80

**12.** ఇప్పటివరకు నిబంధన 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించని రాష్ట్రాలు ఏవి?

ఎ) పంజాబ్, కేరళ బి) ఛత్తీస్‌గఢ్, తెలంగాణ

సి) రాజస్థాన్, గుజరాత్ డి) ఏవీ లేవు

**13.** దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితిని ఎన్నిసార్లు విధించారు?

ఎ) 3 బి) 5 సి) 126 డి) విధించలేదు

**14.** రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడానికి రాజ్యాంగం ప్రకారం కింది ఎవరి నుంచి లిఖితపూర్వక సలహా అవసరం?

ఎ) ప్రధాన మంత్రి బి) కేంద్ర కేబినెట్

సి) ఉపరాష్ట్రపతి డి) సలహా అవసరం లేదు

**15.** రాష్ట్రపతి తన విధి నిర్వహణలో ఎవరికి జవాబుదారీగా ఉంటారు?

ఎ) సుప్రీంకోర్టు బి) ప్రధానమంత్రి సి) క్యాబినెట్ డి) పైవేవీ కాదు

**జవాబులు**

**1-బి; 2-సి; 3-ఎ; 4-డి; 5-బి; 6-సి; 7-బి; 8-ఎ; 9-బి; 10-డి; 11-ఎ; 12-బి; 13-డి; 14-బి; 15-డి.**

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**